

"ఇరానీ హోటల్లో చాయ్ తాగుతున్నప్పుడు వచ్చేడు వీర్రాజు"

"ఏం సార్? ఏమయింది మీ లీవు?" వస్తూనే ఎదుటిసీట్లో కూలబడి అడిగేడు తనూ చాయ్ ఆర్డర్ చేస్తూ.

"ఏముంది కావడానికి? మామూలే!" చెప్పాను నిరాశగా.

ఏలూరు నుంచి జయ వచ్చింది రెండ్రోజుల క్రితం ఏదో ఇంటర్వ్యూకి. వాళ్ళ అన్నయ్యగారింట్లో వుంటూ నిన్ననే నన్ను కలిసింది. డిగ్రీ రోజుల్నుంచీ మా పరిచయం.

"మా అన్నయ్యకి తీరదు. ఊరు చూపించవా? రేపు గోల్కొండకి వెళ్దాం" అనడిగింది. తప్పదు. కానీ ఎలా? పనిచేస్తున్నది ప్రయివేటు కంపెనీలో. జీతానికేమీలోపం లేదు. కానీ సెలవు దొరకటం చాలా కష్టం. అందులోనూ మా ఆఫీసరు ఓ గొప్ప స్పెసిమన్. సిక్ లీవు పంపితే రెండు యాపిల్స్‌కొని ఇంటికివచ్చి తనిఖీచేసి వెళ్ళే రకం. అందుకే అసలు కారణమే రాశాను లీవు అప్లికేషన్‌లో అది చూడగానే లోపలకు పిలిచి.

"కుర్రాడివి. ఇలా తిరుగుళ్ళు తిరిగితే ఎలాగోయ్? నీ వయసులో ఉన్నప్పుడు నాకూ ఉండేవాళ్ళు ఫ్రెండ్సు అంతమాత్రాననేనెప్పుడూ వర్కు వొదలేసి తిరగలేదు" అని అరగంటసేపు చిన్నప్పుడు వర్కు సఫరవ్వకుండా తనెలా రొమాన్సు చేసిందీ వివరించి, చివరికి "నీ ఫ్రెండుకో సిటీబస్‌గైడ్ పడెయ్యి. తనే వెళ్తుంది" అని వొక ఉచిత సలహా పారేసి ఇంకవెళ్ళొచ్చు అన్నట్లు మొహం పెట్టాడు. ఉసూరోమనుకుంటూ బైటకొచ్చి హోటల్ నుంచి ఫోన్‌చేసి చెప్పాను జయకి అదే సంగతి. తనేమనుకుందో ఏమీ మాట్లాడలేదు.

"లీవు ఇవ్వలేదన్నమాట?" నన్నే చూస్తున్న వీర్రాజు అడిగేడు.

"అవును"

నవ్వేడు వీర్రాజు "గొప్ప చిత్రమయిన గురుడండీ మనాడు"

చిత్రమయిన మనిషి కాదు. శాడిస్టు వెధవ.

ఓసారి మా సెక్షన్ హెడ్ గారు ఆయన తల్లిగారికి వంట్లో బావోలేదని కబురొస్తే సెలవు కావాలని అప్లికేషను పెట్టేరు మా ఆఫీసరు ఆయన్ని లోపలకి పిలిచి కడివెడు సానుభూతి గుమ్మరించి, ఆ తర్వాత తన పర్సనల్ ఎక్స్‌పీరియన్స్‌లోకి దిగిపోయేరట! అప్పుడెప్పుడో ఆయన తల్లిగార్కి కూడా బాగా సీరియస్సైతే వెంటనే రమ్మని తనకి టెలిగ్రాంలు వచ్చిందట. అప్పుడు సంవత్సరం చివర ఎకౌంట్సు చూస్తున్నారట. అందుకే వర్కు చూస్తూ ఉండిపోయేరట! "మనం వెళ్ళి చేసేదేముంది సార్? డాక్టర్లు అదీ ఎలాగూ చూస్తూనే ఉంటారు కదా? ప్రస్తుతానికి ఉండండి. అంతగా కావలిస్తే రేపు శనివారం హాఫ్‌నుంచివెళ్లుదురుగాని" అని సెలవిచ్చాట్ట. తర్వాత సెక్షన్ హెడ్‌గారి తల్లికి బాగైందనుకోండి. అది వేరే సంగతి.

అలాగే సత్యనారాయణ అనే మాకో క్లర్కొకడు మరదలు పెళ్ళని సెలవు పెడితే, తనకెంత మంది మరదళ్ళు ఉన్నదీ, వాళ్ళ వయసు, ఎత్తు, మొగుళ్లు, పెళ్ళయిన తేదీలు మొదలయిన వివరాలన్నీ వెల్లడించి "వీళ్ళెవరి పెళ్ళిళ్ళకీ నేను వెళ్ళలేదోయ్! అంతమాత్రాన వీళ్లు కాపురాలు చెయ్యడం మానేసేరా? పిల్లల్ని కనడం మానేసేరా?" అని మిలియన్ డాలరు కొశ్చెనడిగి, మరదళ్ళు పిల్లల్ని కనడంలో బావల చెయ్యి బొత్తిగా ఉండరాదనే యూనివర్సల్ ట్రూత్‌ని ఆవిష్కరించి లీవ్ లెటరును డస్టుబిన్‌లోపడేసి రావుగోపాలరావులా నవ్వేడట! ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే మా వాడికి అదొక బ్యాడ్ హేబిట్. మనం ఏ కారణంచెప్పి సెలవడిగినా ఆ సందర్భం తన జీవితంలోనూ తారసపడిందనీ తను సెలవు పెట్టలేదనీ చెప్పడం వారి అలవాటు. "అలా కృషిచేస్తే తప్ప మీరంతా కూడా ఆఫీసర్లు కారోయ్" అని ఉచిత సలహా కూడా పారేస్తుంటాడు మా మీద.

"టైమైంది. ఇంక వెళ్దాంరండి" ఆలోచనలోంచి బైటకి తీసుకొచ్చేడు వీర్రాజు. అతను మా ఆఫీసులో సబ్‌స్టాఫ్. కొత్తగా వచ్చేడు. ఇద్దరంలేచి ఇరానీ హోటలు ఎదురుగానే ఉన్న మా ఆఫీసులోకి నడిచాం. నడుస్తూ హఠాత్తుగా అన్నాడు వీర్రాజు "ఇవ్వాల్టి నుంచి వారం రోజులు సెలవు తీసుకోబోతున్నా సార్"

"ఎన్ని రోజులు?"

"వారం"

సర్కాస్టిక్‌గా నవ్వేను. "ఒక్కపూటకి తీసుకో. పది రూపాయలు బెట్"

"సరే! సాయంత్రం వచ్చి ఆర్డరు చూపిస్తాను"

నవ్వుకుని నా సెక్షన్‌లోకి నడిచాను. అది అసంభవమని నాకు తెలుసు.

నా సెక్షను వీర్రాజు సెక్షను వేరు కావడంతో సాయంత్రం వరకూ నాకూ మళ్ళీ కనపడలేదతను. ఐదింటికి ఫైళ్లు సర్దేసి లేస్తూంటే వచ్చేడతను "హలో సార్" అంటూ.

"ఏమైంది?" ఎగతాళిగా అడిగేను తలెత్తకుండానే సమాధానం ముందే తెలుసుగనక.

"మీరు పది రూపాయలిచ్చేస్తే ఇప్పుడే బయల్దేరుతానూ మా ఫ్రెండు పెళ్ళికి"

షాక్ తిన్నాను. తలెత్తి "ఎలా ఇచ్చాడు లీవు?" అనడిగేను అయోమయంగా.

"వారం రోజులు"

ఆశ్చర్యంలోంచితేరుకోకుండానే అడిగేను "ఏమని పెట్టావు?"

"మా ఆవిడ ఎవడితోనో లేచిపోయిందని ఊర్నుంచి మా అమ్మ ఉత్తరం రాసిందనీ ఆ వ్యవహారం సెటిల్ చేసుకోడానికి సెలవు కావాలనీ అడిగేను 'ఆగేడు వీర్రాజు''

"మరేం మాట్లాడకుండా లీవు శాంక్షనైపోయింది. నాకసలింత వరకూ పెళ్లే కాలేదన్న సంగతి ఆయనకి తెలిసే ఛాన్సు లేదనుకోండి. మీరు చెప్తే తప్ప" ✱

# సుస్తైఇంక సెలవు

మందడి తిలక్

